# అమ్మ ఎవరికైనా అమ్మే

ఆ ఊరికి మళ్ళీ వెళతాననుకోలేదు. అయినా ఐదేళ్ళ తరవాత వెళ్ళక తప్పలేదు. నా జ్ఞాపకాల ఆల్బంలో ఆ ఊరి ఛాయాచిత్రం పదిలంగా వుంది. శ్రీకాకుళానికి యాభై కిలోమీటర్ల దూరంలో ఆ ఊరు. వంశధార, నాగావళి, వేగావతి నదుల మధ్య దీవిలా ఆ ఊరు.

ఒక వైపు బాగా ఎత్తయిన కొండలు, పచ్చటి పంటపొలాలతో చిత్రకారుడు కాన్వాసు మీద చిత్రించిన చిత్తరువులా అందంగానే ఉంటుంది ఆ ఊరు. ఇది అనంత విశ్వంలో, భూగోళంలో రెండో పక్క ఫ్రేములో కనబడకుండా బిగించిన ఆ ఊరి చిత్రం అయితే రెండో పార్శ్వంలోని అరాజకీయ నీడలు, క్రీనీడలు మాత్రం ఆ ఊరి విచిత్రం. అవే నన్ను ఆ ఊళ్ళో పనిచేసే రోజుల్లో బాధపెట్టాయి.

ఆ ఊరికి ఏ వసతులు లేవు. సరయిన రోడ్డు లేదు. వర్షాకాలం బస్సులు రావు. ఐదు కిలోమీటర్లు నడవాలి. ఆ ఊరికి అనుకునే కడుతున్న రిజర్వాయరు వల్ల ఆ మండల కేంద్రపు గ్రామాలన్నీ ముంపుకు గురయ్యాయి. ప్రజలు నిరాశ్రయులయ్యారు. వారికి ఇంకా నష్టపరిహారం అందలేదు.

ఇలా ఐదేళ్ళ క్రితం ఆ ఊరి పరిస్థితి ఉండేది. ఇప్పటికి అలానే వుంది అన్నారు నేను ఆ ఊళ్ళోకి అడుగు పెట్టగానే.

ఆ ఊరి ఎదుగుదల ఆగిపోవడానికి కారణం ఆ ఊరిని ఏలుతున్న ఇద్దరు వ్యక్తులు. తమ రాజకీయ పలుకుబడితో ఆ ఊరిని మండల కేంద్రంగా మార్చేశారు. వారిద్దరి ఆస్తులు ఈ ఐదేళ్లలో బాగా పెరిగాయి. దానికి సమానంగా ఆ ఊరి ప్రజల అప్పులు పెరిగాయి. ఆ ఇద్దరిమధ్య పచ్చగడ్డి వేసి చుట్టకాల్చుకునే ప్రబుద్ధులు ఉండటంతో ఆ ఊరు రెండుగా విడిపోయింది. ఇలా ఐకమత్యం లేక ఆ ఊళ్ళో అభివృద్ధి కుంటుపడింది.

అయితే ఆ ఇద్దరూ ఒక తల్లి గర్భం నుంచి పుట్టికూడా ఆగర్భ శత్రువుల్లా మారడమే ఆ ఊరి అరాజకీయ చిత్రం.

ప్రస్తుతం ఆ ఇద్దరు అన్నదమ్ములు ఎన్నికల బరిలో దిగారు.

ఆ ఊళ్ళోవారికి ఒకే అవకాశం! రావణుడుని ఎన్నుకోవాలా? లేక హిరణ్యకశిపుడినా? దుర్మార్గుడినా లేక దుష్టుడినా? ఇలా ఓటున్న వారందరిలో గుబులు. ఎవరు గెలిచినా వారికి మిగిలేది దిగులు.

ఐదేళ్ళక్రితం ఆ ఊరి స్కూల్లో ఏకోపాధ్యాయుడిగా పనిచేసినపుడు వారితో నాకు మిగిలినవి చేదు జ్ఞాపకాలే.

నేను రాక మునుపు ఆ స్కూలు ఒక సోదరుడు పశువులశాలగా మారిస్తే, మరో సోదరుడు పానశాలగా మార్చాడు. నా ఆగమనంతో వారి అక్రమాలకు తెరపడింది. అలా వారు నామీద కోపం పెంచుకున్నారు. అలా రెండేళ్ళు వారిని భరించి, కొత్తగా వచ్చిన జీవో పుణ్యమా అని మా జిల్లాకు తిరుగు ముఖంపట్టాను. తిరిగి డ్యూటీ వేయడంతో ఐదేళ్ళ తర్వాతే ఆ ఊళ్ళోకి పోలింగ్ అధికారిగా అడుగు పెట్టాను.

ఈ ఐదేళ్ళలో ఆ ఊళ్లో ఏ రకమైన అభివృద్ధీ లేకపోగా సోదరులిద్దరి ఆగడాలతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఇలా విసుగెత్తిన వారంతా మూడో వ్యక్తిని ఎన్నికల బరిలోకి దించారు. ఆయన ఒక రిటైరయిన స్కూలు టీచరు.

ఎలక్షనుకు ఒక రోజు ముందుగానే ఆ ఊరు చేరుకున్నాను. మా సిబ్బందితో పోలింగ్ ఏర్పాట్లు చేయించాను. ఇక్కడి అరాజకీయపు పోకడల గురించి చేదు జ్ఞాపకాలు ఉండడంతో ఎలక్షను ఎలా సాగుతుందో అనే బెంగతో ఆ రోజు రాత్రి నిద్రపట్టలేదు.

ఉదయం లేవగానే కాలకృత్యాలు ముగించి అమ్మవారి కోవెలకు బయలు దేరాను. గుళ్ళోనించి తిరిగొస్తుంటే ఒక పెద్దాయన ఎదురయ్యాడు. ఆయన నాకు గతంలో పరిచయం. ఆ ఊళ్ళో కొద్దిగా చదువుకున్న వాళ్ళలో ఒకడు. వృత్తి మాత్రం వ్యవసాయం.

"బావున్నారా?" అన్నాను ఆయనను గుర్తుపట్టి.

"ఏం బావుండటం? ఇన్నేళ్ళు గడిచినా ఊరి పరిస్థితిలో మార్పులేదు అటు చూడండి!" అన్నాడు.

దూరంగా కనిపిస్తున్న దృశ్యం చూసి ఆశ్చర్యపోయాను. ఊరికి దక్షిణం వైపున్న ఇళ్ళన్నీ ముంపువల్ల మునిగిపోయాయి. ఇది వరకు మనుషులతో కళకళలాడే ఆ ప్రదేశం అంతా జలమయం.

"వాళ్ళంతా ఎక్కడికి వెళ్లారు?" అన్నాను.

"ఇన్నేళ్ళు గడుస్తున్నా ఇంకా నష్టపరిహారం అందలేదు. పొట్ట చేతపట్టుకుని అంతా వేరే ఊళ్ళకి వలస వెళ్ళిపోయారు" అన్నాడాయన ఆవేదనగా.

ఆయన మాటలకు నాకు బాధ కలిగింది.

"ఈ పరిస్థితుల్నించి బయటపడాలంటే మంచి నాయకుడిని ఎన్నుకోవాలి"

అలా అంటూ ఆయన వెళ్లిపోయాడు.

నేను గబగబా ఎలక్షను జరిపే పోలింగ్ బూతు పరిసరాలకు చేరుకున్నాను.

స్కూలు భవనం పరిస్థితి ఘోరంగా వుంది. రాత్రి చంద్రుడు, పగలు సూర్యుడు తొంగి చూసేందుకు వీలుగా పైకప్పు ఎగిరి పోయింది.

ఉదయం ఎనిమిది గంటలకే ఎలక్షను మొదలయింది. ఓటర్లు రావడంతో తొందరగానే ప్రారంభించాము. సాయంత్రం వరకూ క్షణం తీరిక లేకుండా పోలింగ్ జరిగింది.

ఏ గొడవలు లేకుండా ప్రశాంతంగా ఎలక్షను సాగడంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నాము.

ఇక ఎలక్షను ముగింపుదశకు చేరుకుంటుందనే సమయానికి ఒక ఎనభయ్యేళ్ల ముసలావిడ ఒక వ్యక్తిని ఆసరాగా చేసుకుని ఓటెయ్యడానికి వచ్చింది. ఆమెకు చూపు సరిగ్గాలేదు. నడుం వంగి పోయింది. ఆ స్థితిలో అంత శ్రమపడి ఓటెయ్యడానికి వచ్చినందుకు నాకు ఆవిడ మీద గౌరవం కలిగింది. ఆ విషయమే ఆవిడతో చెప్పాను.

అందుకు ఆవిడ నవ్వుతూ "ఎలక్షనులో నిలబడ్డ ఇద్దరూ నా కొడుకులు బాబూ, ఇద్దరూ వచ్చి బతిమాలితే బిడ్డలమాట కాదనలేక ఓటు వెయ్యడానికి వచ్చాను" అంది.

ఆ మాటలు విన్న నాలో ఆశ్చర్యం. ఓటు ఎలా వెయ్యాలో ఆమెకు వివరించాను.

"కళ్ళు సరిగా కనబడవు నాయనా, నేను చెప్పినట్లు ఓటు వెయ్యి" అంది ఆమె.

నాలో మళ్ళీ ఆశ్చర్యం, కుతూహలం. ఆమె ఎవరికి ఓటు వెయ్యమంటుంది?

ఆమెకు ఏ కొడుకంటే ఇష్టం!? నీకు కుడికన్ను ఇష్టమా, ఎడంకన్ను ఇష్టమా అంటే ఆ తల్లి ఏం సమాధానం చెపుతుంది. ఉన్న ఒక్క ఓటును ఒక్క కొడుక్కే వేయ్యాలి. ఈ సమస్యని ఆమె ఎలా అధిగమిస్తుంది? నాలో ఆ క్షణంలో మెదిలిన ప్రశ్నలు ఇవి. ఆమె వెంటనే చెప్పేసింది, తన మనసులో మాట.

"మైగాడ్!" అనుకుంటూ "అలా చేస్తే చెల్లదు" అన్నాను.

"ఓటు చెల్లుతుందో లేదో నాకు తెలీదు. నేను చెప్పినట్టు చెయ్యండి" అందామె గట్టిగా.

ఆమె చెప్పినట్టే ఆ ఇద్దరి కొడుకుల గుర్తులముందు ముద్రవేశాను. అలా చేస్తుంటే నా అంతర్నేత్రం తెరుచు కున్నట్టయింది.

ఆ తల్లి ఓటు చెల్లకపోతేనేం, ప్రేమను సరిసమానంగా పంచగలశక్తి తల్లికి మాత్రమే ఉంటుంది. అనడానికి నిదర్శనంగా ఆ చెల్లని ఓటు నిలిచింది. అని నాకు అనిపించింది.

ఆ ఇద్దరు సోదరులకు ఓట్లు సమానంగా పడ్డాయి. ఇద్దరూ ఓడిపోయారు. మూడో అభ్యర్థిగా నిలబడిన రిటైర్డు స్కూలు టీచరు గెలిచారు ఒక్క ఓటు తేడాతో.

ఇప్పుడు ఊరంతా ఒకటిగా కలిసిపోయింది. పదవి మూడో వ్యక్తి చేతిలోకి వెళ్ళడంతో ఇద్దరు సోదరుల ప్రభావం తగ్గిపోయింది.

ఇప్పుడిక ఊరు బాగుపడుతుంది. రోడ్లొస్తాయి, బస్సులు తిరుగుతాయి, ముంపుకుగురయిన ప్రాంతం ప్రజలకు నష్ట పరిహారం అందుతుంది. స్కూలు భవనంలోకి సూర్యుడు, చంద్రుడు ఇక తొంగి చూడరు.

ఎవరో రచయిత చెప్పినట్లు ఆ, ఆ లు దిద్దే దశలో మనం నేర్చుకునే మొదటి మాట అమ్మ, ఏదయినా నొప్పి తగిలితే ముందుగా మనం అమ్మా! అనే అరుస్తాము. అమ్మ ఉన్న ప్రతి బిడ్డా మహరాజే. అందుకే భగవంతుడు అన్ని చోట్ల ఉండలేక

అమ్మను సృష్టించాడు.

అలా ఆ ఊళ్ళోని ఆ అమ్మ కొడుకులతో పాటూ ఆ ఊరికే తన ప్రేమను పంచింది ఆ చెల్లని ఓటుతో.

అమ్మ ఎవరికైనా అమ్మే!

*ధ్యానమాలిక, డిసెంబర్ 2007*

*(ధ్యానమాలిక కథలపోటీలో ప్రోత్సాహక బహుమతి పొందింది)*

* * * * *